# 16

## పుస్తకాలు పరధ్యాస

ఏమిటండీ వెతుకుతున్నారు? మీ పుస్తకాలుకాని, మీ కాగితాలుకాని ముట్టుకుంటే ఒట్టు! ఒకచోట పెట్టి ఒక చోట వెతుకుతారు. అయినా ఇంటినిండా ఈ దిక్కుమాలిన పుస్తకాలొకటమ్మా! అలమర్లన్నీ నిండిపోతున్నాయి. బల్లమీద-గూళ్ళ లోనూ, కిటికీలోనూ, పక్కలమీద నా నెత్తిమీద ఎక్కడ పడితే అక్కడ పుస్తకాలు! ముఖ్యమైన కాగితాలు. ఉత్తరాలు చదువుతూ ఏదో పుస్తకంలో పెట్టేసి మర్చిపోతారు.

కనపడకపోతే నా మీద ఎగిరిపోతారు. ఆడదానికి ఒద్దికమూ, మగవాడికి పరధ్యాసా పనికి రాదమ్మా!

నేను మీ బల్ల కెలికేసా నంటున్నారా? మీ పెన్ను తాళం చెవులూ కళ్ళజోడూ కనపట్టంలేదా? పిల్లలున్న ఇల్లు-ఎక్కడ వస్తువు అక్కడ ఎలా వుంటుంది చెప్పండి? మీ కలంతో రాయవద్దని ఎన్నిమాట్లు చెప్పాననుకున్నారు? అయినా వాళ్ళ పెన్నులు కనిపించకపోతే బల్లమీద ఎదురు గుండా వున్నదికదా అని మీ పెన్ను రాసు కుని బళ్ళోకి పట్టుకుపోతారు. నాన్నగారి వస్తువులు ముట్టుకోకూడదన్న జ్ఞానం వాళ్ళకి ఎప్పుడొస్తుందో ....అదిగో కళ్ళజోడు ఇక్కడ పెట్టారు అక్కడ వెదుకుతున్నారు. ఈ పుస్తకాలమధ్య పడిపోయింది. అవతల కుంపట్లో చారు. మరిగి పోతోంది. కేరియరు సర్దాలి! పనిపిల్లను పంపించి స్కూల్లో మర్చిపోయాడేమో మల్లిబాబు పలక వెతికించాలి. రోజా సోపంక- ఆ బూట్లు పాలిష్ చేయాలి సాక్సు ఉతికినవి. వెతికితీయాలి. మీకు కూడా అన్నీ వెతికి చేతికందియటానికి నాకు తీరిక ఎక్కడ వుంటుంది చెప్పండి?

అన్ని విషయాలెందుకు ఒక్కమాటు ఆలోచిస్తారు? ఆ చేతులు తిప్పుకుంటూ ఆ పచార్లేమిటండీ? మీలో మీరు మాట్లాడుకుంటూ మీలో మీరు నవ్వుకుంటూ వుంటారు. బయట కూడా ఇలానే వుంటారా? ఆ పుస్తకాలన్నీ చదివి ఇలా తయారవు తున్నారు. మిమ్మల్ని చూస్తుంటే ఏమిటో ఒకప్పుడు నాకు భయం భయంగా వుంటుందండీ!

ఆ చేతిలో పుస్తకం ఇలాయిచ్చి పోదూరు అలా బజారు కెళ్ళొస్తారా? పంచదార అయిపోయింది. నిన్నరాత్రి పప్పుడి మెతుకులు తిన్నాము. ఈ పూటైనా కూరలు తెస్తారా- వంకాయలు మీకు ఏవటం

తెలీదు. అరటికాయలు బంగాళాదుంపలు వస్తుంది గోంగూరవద్దు. మిరపకాయలా- సూనె మింగేస్తుంది. పచ్చి మిరపకాయలా. అల్లం. ఉల్లిపాయలు మర్చిపోకండి. మీరు పరధ్యానంగా అటూ ఇటూ చూస్తూవుంటే కేజీకి అరకేజీయే తూస్తారు. నాక్కాబు - పుణ్యముంటుంది; రాసుకోడానికి మూర్ఛకండి: వారానికి రెండుసార్లైనా బజారు కెళ్ళి ఏవోతెచ్చి నా మొహాన తగలెయ్యకపోతే ఏంపెట్టి వండుతాను? కాక్కా. చేతులు పెట్టి వండాలి. నా కర్మ! బతిమాలినా వినూరు చెప్పినా. మొత్తుకున్నా వినరు. అప్పుడే బట్టలు వేసుకున్నారూ? పక్కానికి మంచిగురూ- అయితే నేను ఇంత సేపటినుంచీ చదివిన చదువంతా గాలితో కలిసి పోయిందీ?

ఆ డబ్బు లక్కుంచి పెట్టండి. నేనేవెళ్ళివీధిలో పడతాను ఉండమ్మ నమ్మా అంటూ. ఇంకా స్నానం చేయాలి. తలదువ్వుకోవాలి. బట్టకట్టుకుని బొట్టు కాటుకా పెట్టుకుని తెమిలి వెళ్ళాలంటే చాలా సేపు పడుతుంది. ఇల్లు పనిపిల్లకు చప్పచెప్పి వెళ్ళితే దానికి ఏ క్షణాన ఏ బుద్ధిపుడుతోందో -ఏవేనా ఎత్తుకుపోతే: ఒక నేతి గరిటపోతే మళ్ళీ కొనుక్కోలేం?

అయ్యో వెళ్ళిపోయారు నేనిలా వాగుతోంటే వాక్కుంటే వాక్కుంటుందీ- దీనివాగుడు మనకేం లక్ష్యం- అని నా మొహాన కొట్టినట్టు వెళ్ళిపోయారా? అప్పుల్నెండి - నన్ను కట్టుకున్నారు. ఈ సంసారమంతా నా వల్ల పెరిగిన సంసారమే కదా! మీరు మహారాజులు - దిక్కుమాలిన జన్మమూ ఏంజన్మ ఆడజన్మ? ఓ సినిమా కెళ్ళాలంటే దీనికి ముక్కు తుడవాలి; దానికి మూతి తుడవాలి; వాడికి నీళ్ళుపోయాలి; ఈ మూకనంతా సవరించి లాగూలూ చొక్కాలూ కట్టి సిద్ధంచేస్తే- ఆయన ఇంతమందినీ వెంటేసుకుని వీధిలో కెళ్ళటానికి సిగ్గుపడిపోతారు. ఆ సంగతి చెప్పలేక పదిరూపాయలిస్తాను. మీరంతా వెళ్ళిరండి. ఆ తెలుగు సినిమాలునాకు బోరు కొడుతాయి అని తప్పించు కుంటారు. దీనికూడా చేరవాడ నిష్వాటు. అడిగినదంతా యిచ్చేయాలిసిందే —

అంచేత ఈ ఇల్లు నాకు రాసి పెట్టివుంది. ఈ సంసారం నాపీకకు ఉరిత్రాడు. నన్ను ఎన్ని రకాలుగా ఏడిపించాలో అన్ని రకాలుగా మీ ఇష్టం వచ్చినట్లు ఏడిపించండి!

డ్రస్సు వేసుకుని జోళ్ళు టకటక లాడించుకుంటూ మాటా మంతీ లేకుండా వెళ్ళిపోయారు గదూ?

ఇంట్లో ఉన్నంతసేపూ చిరాకు పడిపోతూ వుంటారు. నా మొహం చూసే అనుకుంటారు.

అయ్యో! నా మతి మండిపోనూ - ఏదీ చంటిపిల్ల....ఎక్కడా? ఇప్పుడిక్కడ ఆడుకుంటున్నదే- ఏదీ? నా చిన్నచిన్న గాజులు? నా వజ్ర సూదికమ్మలా? నా వరహాలపేర్లేవీ? నా అపరంజి బొమ్మా - ఎక్కడ దాక్కున్నావ్? పాపి నీ....ఈ మంచం క్రింద ఏం చేస్తున్నావే? రామ్మా లాలపోస్తాను. బూడిద బుస్సమ్మ లాగున్నావు.

ఎందుకే ఆ బోసినవ్వులూ?

అక్కా - అన్నయ్యల పుస్తకాలన్నీ చింపుతున్నావా మూల కూర్చుని - వాళ్ళొచ్చి ఏడుస్తారే.... పైకమెంతయింది చెప్పమ్మా? రేడియో కట్టేస్తారే....వాళ్ళకి ఇల్లా వాకిళ్ళా వుండవూ ఆ రేడియో ముందు అరుస్తూ కూర్చుంటే ఇంట్లో యిల్లాళ్ళేమయి పోతారు? నాలాగే తిట్టుకుంటూ తిప్పుకుంటూ.... దిక్కుమాలిన జీవితాలు....ఆడబతుకే మధురం అన్నాట్ట ఎవడో-పిల్లలు ఈ మొగుడు ఈ సంసారం నా చుట్టూ చక్రంలా తిరుగుతోంది- నేను లేక పోతే....

అయ్యో! నా మతిమండా-టిఫిన్ చేసి పెట్టడం మర్చి పోయాను. పాపం తినకుండా వెళ్ళిపోయారు. కడుపులో ప్రేగులు అరుస్తాయి. దిక్కుమాలిన దాన్ని! అయితే గుమ్మటంలా ఇంట్లో కూర్చునేదాన్ని నాకెందుకు? నాకూ అక్కర్లేదు టిఫిను.... ... ....